పదేండ్లు ఇదే మొత్తుకున్నాం

కేంద్రం నుంచి రాష్ట్రానికి సహకారం లేదంటే... కేసీఆర్ పంచాయితీ వల్లే నిధులు రాలేదన్నారుగా!

ఇప్పుడు కాంగ్రెస్‌కు తత్వం బోధపడింది • బడ్జెట్‌లో అన్యాయం తెలంగాణ హక్కులను కాలరాయడమే: కేటీఆర్

- ప్రధానిని బడేభాయ్ అన్నా ఫలితం దక్కలే
- యాచిస్తే రాదు .. శాసిస్తేనే నిధులు
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై చర్చను స్వాగతిస్తున్నాం.. మద్దతిస్తున్నాం
- మీతో వస్తాం.. కలిసి కొట్లాడుదాం
- కేసీఆర్‌పై కోపంతో రాష్ట్రాన్ని నాశనం చేయొద్దు.. అది మీకే నష్టం
- బడ్జెట్‌లో అన్యాయంపై చర్చలో కేటీఆర్
- 27న నీతి ఆయోగ్ భేటీని బహిష్కరిస్తాం
- అందరం కలిసి కేంద్రంపై పోరాటం చేద్దాం
- తెలంగాణ రూపాయి ఇస్తే కేంద్రం 47 పైసలే తిరిగి ఇస్తున్నది
- బీహార్‌కు మాత్రం రూ.47 ఇస్తున్నది: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

> **కేసీఆర్ పేరు తీయకుంటే బతుకుదెరువు లేదా?**
>
> ముఖ్యమంత్రిగారూ.. కేసీఆర్ పేరు చెప్పకపోతే బతుకుదెరువు లేదా సర్? మోదీగారి పేరుతీయడానికి కూడా ఎందుకు భయపడుతున్నడు ముఖ్యమంత్రి? అంత భయమెందుకు సర్. అందుకే మేమనేది అధ్యక్ష.. ఇవ్వాల నోటికొచ్చినట్లు మాట్లాడితేకాదు! తప్పకుండా రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలె! ఎనిమిది ఎంపీలున్నా.. తెచ్చింది గుండు సున్నా! ఆరుగ్యారెంటీలు ఎత్తేయడానికి గత ప్రభుత్వం మీద బదనాం చేయడం.. రాష్ట్రం దివాలా తీసిందని బదనాం చేసినా తప్పించుకోరు.
>
> - కేటీఆర్

హైదరాబాద్, జులై 24(నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని, విభజన చట్టానికి తూట్లు పొడవడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభలో బీఆర్ఎస్ లేకపోవడం వల్లనే రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు చెరో ఎనిమిది ఎంపీ స్థానాలు ఇచ్చినా, ఆ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం లేదని దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్యలో బీఆర్ఎస్ తరపున కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం సాయం చేసే విషయంలో గత పదేండ్లుగా జరిగిన అన్యాయం ఇంకా కొనసాగుతూనే ఉన్నదని కేటీఆర్ నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్‌కు రాజకీయ ప్రయోజనాల కన్నా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో అన్యాయంపై చర్చను బీఆర్ఎస్ పూర్తిగా స్వాగతిస్తున్నదని, సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు. పదేండ్లు తాము అధికారంలో ఉన్నప్పుడు ఏం చెప్పామో, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే చెప్తున్నదని వివరించారు. గతంలో తాము చెప్తే పట్టించుకోలేదని, కేసీఆర్ పంచాయితీ వల్లే రాష్ట్రానికి నిధులు రాలేదంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారని గుర్తుచేశారు. తాము బీఆర్ఎస్‌లా కాదని, కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించి నిధులు తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను ఈ సందర్భంగా కేటీఆర్ ఉటంకించారు. ప్రధానిని బడేభాయ్ అన్నప్పటికీ ఫలితం దక్కలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి తమ వరకు వస్తే గానీ అసలు తత్వం బోధపడిందని అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి లోక్‌సభలో బీఆర్ఎస్ జెండా లేకపోవడమే కారణమని చెప్పారు. మ్యాథ్స్‌లో 8+8=16 అయితే కాంగ్రెస్, బీజేపీ లెక్కలో మాత్రం 8+8=0 అని ఎద్దేవా చేశారు. 2 పార్టీలకు 16 ఎంపీ సీట్లు ఇచ్చినా రాష్ట్రానికి న్యాయం జరగలేదని విమర్శించారు. విభజన హామీల అమలు కోసం కేంద్రంపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పోరాటాలు చేశామని, సీఏఏ, ఎన్ఆర్‌సీలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేశామని గుర్తుచేశారు. మోటర్లకు మీటర్లు, కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ, ఓబీసీ కులగణన, వ్యవసాయ చట్టాలు తదితర అంశాలపై ప్రశ్నించడంతోపాటు వ్యతిరేకించినట్టు తెలిపారు.

యాచిస్తే రాదు.. శాసిస్తేనే వస్తది

ప్రొఫెసర్ జయశంకర్ చెప్పినట్టుగా 'యాచిస్తే రాదు.. శాసిస్తేనే వస్తది' అనే సిద్ధాంతంతోనే తెలంగాణ సాధించామని, ఇకపై కూడా ఇదే పంథాను కొనసాగిస్తామని కేటీఆర్ స్పష్టంచేశారు. కేంద్రం సహకరించకపోయినా తెలంగాణ అభివృద్ధిని ఆపలేదని, దేశంలో తెలంగాణను ఆగ్రగామిగా నిలిపామని వివరించారు. సందర్భాన్ని బట్టి కేంద్రానికి మద్దతు ఇచ్చామని స్పష్టంచేశారు. అదానీకి, కేంద్రం ఒత్తిడికి లొంగిపోవద్దని, డిస్కంలను ప్రైవేటుపరం చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బడ్జెట్‌లో పంజాబ్‌కు అన్యాయం జరిగితే అక్కడి ఎంపీలు రోడ్డెక్కి ధర్నా చేస్తే కాంగ్రెస్ ఎంపీలు మాత్రం మొఖం చాటేశారని విమర్శించారు. తమ రాజ్యసభ ఎంపీలను కూడా పంపిస్తామని ఢిల్లీలో పోరాటం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఇప్పటికీ కూడా సీఎం పనులను ఢిల్లీలో బీజేపీ ఎంపీలే చక్కబెడుతున్నారు. కానీ మాకు ఆ అవసరం లేదు. మేము తెలంగాణ ప్రయోజనాల కోసమే పోరాడుతాం. 2014లో కాంగ్రెస్‌లో విలీనమవుదామని అనుకున్నాం. దిగ్విజయ్‌సింగ్ వైఖరి వల్ల చేయలేదు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీతో చీకటి ఒప్పందం అని మాట్లాడుతున్నారు. 8 మంది ఎంపీలను కాంగ్రెస్‌కు ప్రజలు ఇస్తే మీరు రాష్ట్రానికి తెచ్చింది గుండుసున్నా. దాని గురించి ప్రజలు అడుగుతున్నారు. సీఎం సమాధానం చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రం దివాలా తీసిందంటూ ప్రభుత్వమే ప్రకటిస్తే.. బయట రూపాయి అప్పు దొరకదని చెప్పారు. కేసీఆర్‌పై కోపంతో రాష్ట్రాన్ని నాశనం చేయొద్దని, అది మీకే నష్టమని హెచ్చరించారు. రాష్ట్రానికి ఐటీఐఆర్ ఇవ్వాల్సిందేనని, ఆ ప్రాజెక్టును కాంగ్రెస్ తెస్తుందో, చస్తుందో ప్రజలు చూస్తారని వ్యాఖ్యానించారు. ఆరు గ్యారెంటీల అమలు వరకు కాంగ్రెస్‌ను వెంటాడుతామని స్పష్టంచేశారు.

బీజేపీ సమాధానం చెప్పాలి: పొన్నం ప్రభాకర్

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీ.. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే.. ప్రజలకు మీరు ఏమిచ్చారని ప్రశ్నించారు. బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, వికసిత్ భారత్ అంటే, సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ అంటే కేవలం ఏపీ, బీహార్ రాష్ట్రాలేనా? అని ప్రశ్నించారు.

కేంద్రం వైఖరితో ప్రమాదకర సంకేతాలు: భట్టి విక్రమార్క

బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోవడం ముమ్మాటికీ కక్ష సాధింపేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫెడరల్ వ్యవస్థలో న్యాయంగా రాష్ట్రాలకు రావాల్సిన వాటాను హక్కుగా అడుగుతున్నామని చెప్పారు. నిధుల కేటాయింపులో కేంద్ర వివక్షాపూరిత వైఖరిపై ప్రమాదకర సంకేతాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానంపై భట్టి మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదని పేర్కొన్నారు. దీంతో సభలో ఒక్కసారిగా దుమారం చెలరేగింది. బీఆర్ఎస్ నేతలు మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీలను కలుపుకొని ధర్నా చేద్దాం, ముందుగా అసెంబ్లీలో తీర్మానం చేద్దామని చెప్పారు. రాష్ట్రానికి నిధులు, అనుమతులు, ప్రయోజనాల విషయంలో ప్రతిపక్షం వస్తానంటే ఢిల్లీకి తీసుకెళ్తామని అన్నారు. ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుద్దామని, కేసీఆర్ కూడా వస్తానంటే తీసుకుపోతామని భట్టి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ఒక్క ఏపీకే కాదని, తెలంగాణకు కూడా వర్తిస్తుందని, అయినప్పటికీ కేంద్రం ఏపీపై ప్రేమ చూపి తెలంగాణను విస్మరించడం దారుణమని మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు.

27న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్రానికి రావల్సిన నిధులు, అనుమతులు, ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. ఈ నెల 27న ప్రధాని అధ్యర్యంలో జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలపై ముఖ్యంగా తెలంగాణపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నదని మండిపడ్డారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి ఇస్తే.. కేవలం 47 పైసలే కేంద్రం తిరిగి ఇస్తున్నదని చెప్పారు. బీహార్ రాష్ట్రం రూపాయి ఇస్తే.. వారికి రూ.47 ఇస్తున్నదని వివరించారు. ఐదేండ్లలో ఉత్తరప్రదేశ్ రూ.3.41 లక్షల కోట్లు ఇస్తే.. వారికి కేంద్రం రూ.6.91 లక్షల కోట్లు ఇచ్చిందని.. ఆ స్థాయిలో తెలంగాణకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఐదేండ్లు దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ కక్ష గట్టిందని, దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 22.26 లక్షల కోట్లు ఇస్తే.. తిరిగి 6.91 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయని వివరించారు. ప్రధాని లక్ష్యంగా పెట్టుకున్న 5 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశానికి అత్యధికంగా నిధులిస్తున్న తెలంగాణను ఆదుకోవాలని కోరారు. ట్రిపుల్‌ఆర్, మెట్రో, మూసీ, నీటి సమస్యలు, ఫార్మాసిటీ, ఐఐఎం, గిరిజన యూనివర్సిటీ, కోచ్‌ఫ్యాక్టరీ, ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటికి నిధులు, నీటి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో ప్రధాని అధ్యక్షుడిగా నిర్వహించే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు సభ సాక్షిగా తెలిపారు. ఈ విషయంలో అన్ని పక్షాలు కలిసి వస్తే.. తప్పకుండా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతామని చెప్పారు. తన తీర్మానాన్ని అందరూ ఏకీభవించాలని విన్నవించారు. దీంతో సభంతా చప్పట్ల ద్వారా తమ ఆమోదాన్ని తెలిపారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు.

లోకం పోకడ



అసెంబ్లీ ఆవాజ్

బడ్జెట్ సమావేశాలు

బీఆర్ఎస్ నిలదీత.. సర్కార్ దాటవేత..

నిరుద్యోగుల సమస్యలపై చర్చకు డిమాండ్ కేటీఆర్ వాయిదా తీర్మానం.. స్పీకర్ తిరస్కరణ

ప్లకార్డులతో గులాబీ నేతల నిరసన.. తీర్మానంపై పట్టు

సర్కార్ నుంచి సమాధానం రాకపోవడంతో టీ బ్రేక్ ప్రకటించిన స్పీకర్ గడ్డం ప్రసాద్

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు, జాబ్ క్యాలెండర్ ప్రకటన, ఇతర న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ నేతలు బుధవారం అసెంబ్లీలో నిలదీశారు. ఆయా అంశాలపై సభలో చర్చించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు తీర్మానాన్ని అందజేశారు. వర్షాలు, గోదావరి వరదలపైనా చర్చించాలని వాయిదా తీర్మానాన్ని ఇవ్వగా వాటిని స్పీకర్ తిరస్కరించారు. దీంతో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కోవా లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్ జాదవ్, సంజయ్, మల్లారెడ్డితోపాటు, ఇతర శాసనసభ్యులు ఒక్కసారిగా లేచి నిరసన తెలిపారు. 'నిరుద్యోగులపై పోలీసుల దమనకాండ నశించాలి', 'మెగా డీఎస్సీ ప్రకటించాలి', 'నిరుద్యోగులపై లాఠీచార్జికి క్షమాపణలు చెప్పాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్ఎస్ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానంపై పట్టుబట్టి నిరసన తెలుపుతున్న క్రమంలోనే స్పీకర్ గడ్డం ప్రసాద్ సభకు టీ బ్రేక్ ప్రకటించారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, సర్కారు తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ నుంచి మీడియా పాయింట్ వరకు ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం మీడియా వద్ద మాట్లాడారు. నిరుద్యోగుల అంశాలపై శాసనమండలిలో సైతం ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తిరస్కరించారు.

నాడు అట్ల.. నేడు ఇట్ల!

- అప్పట్లో నీతి ఆయోగ్ సమావేశాన్ని కేసీఆర్ బహిష్కరిస్తే టీపీసీసీ అధ్యక్ష హోదాలో తప్పపట్టిన రేవంత్‌రెడ్డి
- ఇప్పుడు సీఎం హోదాలో రేవంత్‌నోట బహిష్కరణ మాట
- 27న నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లేది లేదని సభలో ప్రకటన
- నాడు కేసీఆర్ నడిచిన బాటలో నేడు రేవంత్

అప్పుడు అలా..!

నీతి ఆయోగ్ మీటింగ్‌కు కేసీఆర్ వెళ్లకపోవడం తప్పు!

నీతి ఆయోగ్ మీటింగ్‌కు సీఎం కేసీఆర్ హాజరుకావాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానిని ప్రశ్నించేందుకు ఇది మంచి అవకాశం. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు కేసీఆర్ నీతి ఆయోగ్ మీటింగ్‌కు వెళ్తానంటే మేమే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తం. ఈ మీటింగ్‌కు కేసీఆర్ హాజరుకాకుంటే ప్రధాని మోదీకి లొంగిపోయినట్టే!

-టీపీసీసీ అధ్యక్ష హోదాలో 2022, ఆగస్టు 7న రేవంత్‌రెడ్డి

ఇప్పుడు ఇలా..!

నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నం

ఈ నెల 27న జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నం. కేంద్రం తెలంగాణ హక్కులకు భంగం కలిగించింది. నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం చేసింది.

-2024, జూలై 24న సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి

కేంద్రం వైఖరికి నిరసనగా నీతి ఆయోగ్ బహిష్కరణ

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని నీతి ఆయోగ్ చేసిన సిఫారసులను కేంద్రం పట్టించుకోనందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నం.

-2022, ఆగస్టు 6న సీఎం కేసీఆర్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : అనుభవంలోకి వస్తే తప్ప జ్ఞానం బోధపడదని అంటే ఇదేనేమో. తెలంగాణ పట్ల కేంద్రం అనుసరిస్తున్న పక్షపాత వైఖరికి నిరసనగా నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు అప్పట్లో సీఎం కేసీఆర్ ప్రకటిస్తే పీసీసీ అధ్యక్షునిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తప్పుపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానిని నిలదీయడానికి నీతి అయోగ్ సమావేశం ఒక మంచి అవకాశమని వాదించారు. ఆ సమావేశానికి సీఎం కేసీఆర్ వెళ్లాలని డిమాండ్ చేశారు. అదే రేవంత్‌రెడ్డి ఇప్పుడు సీఎంగా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు బుధవారం శాసనసభలో ప్రకటించారు. అంటే అప్పుడు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం కరక్టే అని ఇప్పటికైనా ఒప్పుకున్నట్టే కదా? తెలంగాణపై కేంద్రంలో బీజేపీ సర్కార్ వివక్షను కేసీఆర్ ఎందుకు ఎండగట్టాల్సి వచ్చిందో ఇప్పటికైనా రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం అయిందని అనుకోవాలా? కేంద్రం వైఖరిపై అప్పుడు కేసీఆర్ ధర్మాగ్రహంలో న్యాయం ఉందని ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి అంగీకరించినట్టేనా?

కేసీఆర్ అప్పుడు ఎందుకు బహిష్కరించారు

నీతి అయోగ్ సిఫారసులకు కేంద్రం విలువ ఇవ్వనప్పుడు ఆ సమావేశానికి వెళ్లడంలో అర్థం లేదనే బహిష్కరిస్తున్నట్టు రెండేండ్ల కిందట సీఎం కేసీఆర్ (ఆగస్టు 7, 2022)ప్రకటించారు. మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్ల గ్రాంట్, మిషన్ భగీరథకు రూ.19,500 కోట్ల గ్రాంట్ తెలంగాణకు ఇవ్వాలని నీతి అయోగ్ చేసిన సిఫారసును కేంద్రం పట్టించుకోకపోవడంతో.. నిరసనగా నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు కేసీఆర్ వివరించారు. కేంద్రం వైఖరిని తప్పుపట్టాల్సిందిపోయి అప్పుడు పీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్ నిర్ణయాన్నే తప్పుపట్టారు.

అమరావతికి నిధులిస్తే మీకేం ఇబ్బంది?

తెలంగాణకు ఏం చేయాలో బీజేపీకి తెలుసు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతికి నిధులిస్తే.. తెలంగాణకు (మీకు) వచ్చిన ఇబ్బందేమిటి? అని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు ఏం చేయాలో బీజేపీకి బాగా తెలుసు అని పేర్కొన్నారు. తెలంగాణలో తమకు 35 శాతం ఓట్లు వచ్చాయని తెలిసి జీర్ణించుకోలేక కాం గ్రెస్, బీఆర్ఎస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ పద మే బహిష్కరించారని రేవంత్ అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణకు బడ్జెట్‌లో కేంద్రం నిధులు ఇవ్వలేదని ప్రజలను తప్పుదారి పట్టించేవిధంగా, రెచ్చగొట్టే విధంగా ఇవాళ రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కలిసి రావాలి.. కలిసి దీక్షచేద్దాం.. చచ్చుదో..తెలంగాణకు నిధులు తెచ్చుడో అని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సింగరేణిని ప్రైవేటీకరించం

తెలంగాణలోని సింగరేణి కాలరీస్ కంపెనీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని కేంద్ర గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి పార్లమెంట్‌కు వెల్లడించారు. సింగరేణి బలోపేతానికి కేంద్రం కృషిచేస్తుందని చెప్పారు. బుధవారం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఉన్న సింగరేణి.. బొగ్గు నిల్వలు తెలంగాణలోని ప్రాణహిత– గోదావరి లోయలో 350 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నాయి.

అసెంబ్లీ తీర్మానం.. పొలిటికల్ బ్లాక్‌పేపర్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీలో కేంద్ర బడ్జెట్‌పై చేసిన తీర్మానం పొలిటికల్ బ్లాక్ పేపర్ తప్ప మరొకటి కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష మాపారని నిరసిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు.

> కేసీఆర్‌ను దీక్షకు రమ్మంటున్నారు.. ఆయన ఆనాడే తెలంగాణను చావు నోట్లో తలపెట్టి తెచ్చిండ్రు. కేసీఆర్ ధర్నాకెందుకు? నువ్ చెయ్.. నీకు వెయ్యి మందిమి రక్షణ కవచంగా ఉంటాం. మా ఎమ్మెల్యేలందరం వచ్చి మీ చుట్టూ రక్షణగా ఉంటాం. మీరు, మీ క్యాబినెట్ దీక్ష చేయండి.
>
> -బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

గుండు సున్నాపై సమరభేరి

మొదటిపేజీ తరువాయి...

బీజేపీ... సభ నుంచి వాకౌట్ చేసింది. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాడి వేడి చర్చ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ సభ్యులు కే తారకరామారావు, హరీశ్‌రావు మధ్య మాటల తూటాలు పేలిపోయాయి. ప్రధాని మోదీని బడేభాయ్ అని పిలిచినా ఏమాత్రం ఫలితం దక్కలేదని కేటీఆర్ వ్యంగాస్త్రం సంధించారు. తెలంగాణ పట్ల కేంద్రం ప్రదర్శిస్తున్న వివక్షపై పదేండ్లుగా తాము పోరాడుతున్నామని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తత్వం బోధ పడిందంటూ చురకలేశారు. కేంద్రం నుంచి నిధులు సాధించాలంటే.. ప్రొఫెసర్ జయశంకర్ చెప్పినట్టు యాచిస్తే రాదు.. శాసిస్తేనే వస్తది అని కుండ బద్దలు కొట్టారు. నిధుల సాధనకు ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీలో దీక్ష చేయాలని కేటీఆర్ సూచించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. 'మీరు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను తీసుకొని రండి.. నేను, ఆయన కలిసి ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ప్రాణాలు పోయే దాకా దీక్షలు చేస్తాం. తెలంగాణకు నిధులు తెచ్చుడో.. సచ్చుడో తేల్చుకుందాం' అంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులు భగ్గుమన్నారు. సీఎం వ్యాఖ్యలకు సమాధానం చెప్తామని, తమకు మైక్ ఇవ్వాలని హరీశ్‌రావు, కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టుబట్టారు. పోడియం వద్దకు చేరి ముక్తకంఠంతో నినదించారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో మళ్లీ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కలుగజేసుకుని సీఎం వ్యాఖ్యలను సమర్థించే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు 'షేమ్ షేమ్' అంటూ నినాదాలు చేశారు. దీంతో సభ రసాభాసగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు చేతులు జోడించి దండం పెడుతూ మైక్ ఇవ్వాలని వేడుకున్నారు. భట్టి మాట్లాడిన తర్వాత మైక్ ఇస్తామని స్పీకర్ హామీ ఇవ్వడంతో ఎవరి స్థానాల్లో వారి కూర్చుకున్నారు. భట్టి మాట్లాడిన అనంతరం హరీశ్‌రావుకు స్పీకర్ అనుమతిచ్చారు. దీంతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, దానిపై తీర్మానం ప్రవేశపెడితే దానిని ఏకగ్రీవంగా ఆమోదించడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఢిల్లీకి అఖిలపక్షంగా వెళ్లి ధర్నా చేద్దామంటే మేము కూడా సిద్ధం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా ఎలాంటి పోరాటానికైనా బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నది.. ఉంటది' అని స్పష్టంచేశారు. 'కేసీఆర్‌ను దీక్షకు రమ్మంటున్నారు.. కేసీఆర్ ఎందుకు? నువ్ చెయ్.. నీకు వెయ్యి మందిమి రక్షణ కవచంగా ఉంటాం. అని హరీశ్ అంటుండగానే మరోసారి మైక్ కట్ చేశారు. సభా నేతవ్యాఖ్యలను స్పీకర్ సమర్థిస్తూ ఆ వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పు లేదన్నారు.

అన్నీ మేమే చేస్తే.. మీరెందుకు?

'రుణమాఫీ గురించి ఆ మధ్య సీఎం మాట్లాడుతూ.. హరీశ్‌రావు దీక్షలు చేయాలన్నారు. నిరుద్యోగుల గురించి కేటీఆర్ దీక్షలు చేయాలన్నారు. అన్నీ మేమే చేస్తే.. ఇక మీరేం చేస్తారు? మాది ఉద్యమస్ఫూర్తి. తెలుగుదేశం తరపున ఎమ్మెల్యేగా ఉన్న మిమ్మల్ని ఆనాడు రాజీనామా చేయమంటే పారిపోయిన చరిత్ర మీది. ఆనాడు రాహుల్ గాంధీని పప్పు అన్నావ్.. నేడు పీఎం అభ్యర్థి అంటున్నవ్..' అని అంటుండగానే మైక్ కట్ చేశారు. వెంటనే మంత్రి శ్రీధర్‌బాబు కలుగజేసుకొని అందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'మాకొక ట్రాక్ రికార్డు ఉన్నది. మా నాయకుడు చెప్తే రెండుసార్లు గడ్డిపోచల్లాగా మా పదవులను విసిరివేసినం. ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేసిన చరిత్ర నాది. మీరు ఈ రకంగా మా ఉద్యమ స్ఫూర్తిని అ